తలనొప్పిగా రేషన్ సరుకుల పంపిణీ

- మూడుసార్లు వేలిముద్రలు వేయడంతో ఒక్కరికీ 20నిమిషాల సమయం
- ఒకేసారి వేలిముద్ర తో సరకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

అంబర్ పేట, జూన్ 1 : పౌరసరఫరాల శాఖ అంబర్ పేట సర్కిల్ పరిధిలో అమలు చేస్తున్న మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ తలనొప్పిగా మారింది. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో, కేంద్రం ఆదేశాల మేరకు జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని అందజేయడానికి పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా రేషన్ షాపుల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు పంచదార, గోధుమలు కూడా పంపిణీ చేస్తున్నారు. ఆదివారం నుంచి అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అన్ని చౌక ధరల దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు వచ్చే మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉండగా ఒకే నెలలో మూడు నెలల సరుకులు పంపిణీ చేస్తుండడంతో డీలర్లు ఒక కార్డు దారుడికి సంబంధించి మూడుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో డీలర్ ఒక కార్డుదారుడికి రేషన్ ఇవ్వడానికి 20 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఈ పరిస్థితుల్లో సాఫ్ట్ వేర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బ్లూ టూత్ మిషన్ విషయంలో సడలింపు ఇవ్వాలని, ఒక కుటుంబానికి చెందిన బియ్యం ఒకేసారి పంపిణీ చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని డీలర్లు కోరుతున్నారు.

ఐక మత్యంతో ఏదైనా సాధించవచ్చు

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రొఫెసర్ వెంకట్రావు

కాచిగూడ, జూన్ 1: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులు ఒకే తాటిపైకి వచ్చి, ఐక్యత చాటాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ న్యాయవాది అనుముల జగన్ విజ్ఞప్తి చేశారు. పిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్లో నిర్వహించారు. రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు 29 మంది కార్యవర్గ సభ్యులు, 22 మంది నామినేటెడ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్ వెంకట్రావు హాజరయ్యారు. బీద మున్నూరు కాపుల కోసం సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులు పాల్గొన్నారు.

కరోనా వైద్య సేవలకు సర్వం సిద్ధం

ఉస్మానియా దవాఖానలో కరోనా రోగులకు వైద్యసేవలు అందించేందుకు సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు, పడకలు

- ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్

సుల్తాన్ బజార్, జూన్ 1 : దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదువుతున్న తరుణంలో ముందు జాగ్రత్త చర్యగా ఉస్మానియా దవాఖానలో ప్రత్యేకంగా 30 పడకలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసినట్లు ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌సహాయ్ తెలిపారు. ఇటీవల నగరంలో కరోనా కేసు నమోదైన నేపథ్యంలో దవాఖాన వైద్యులు, నర్సింగ్, ఫారా మెడికల్, ఫార్మసీ, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తుందంటే వ్యాపిస్తున్న వదంతుల నేపథ్యంలో కరోనా రోగులకు అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన వైద్య సేవలు అందించేందుకు తీసుకో వాల్సిన చర్యలపై చర్చించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో కృత్రిమ శ్వాసను అందించేందుకు వెంటిలేటర్లు, పడకల సామ ర్థ్యం, సిబ్బంది, నర్సింగ్ సాంకేతిక సిబ్బంది, మందుల తదితర అంశాలపై చర్చించారు. విపత్కర పరిస్థి తులు ఎదురైతే వైద్య సిబ్బందికి సెలవులు పెట్టకుండా 24/7 అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌సహాయ్ వైద్యసిబ్బందికి సూచించారు. రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అంబులెన్స్, ఫార్మసీ విభాగాల సార్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. వెంటిలేటర్ల కొరత రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవ సర పరిస్థితుల్లో చికిత్సల నిమిత్తం దవాఖానకి వచ్చే రోగులు, క్షతగాత్రులకు తక్షణమే వైద్యసేవలు అందించేలా చర్యలు చేప ట్టాలని సూచించారు.

30 పడకలతో ఐసోలేషన్ వార్డు

దేశంలో పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచుకొ ని ఉస్మానియా దవాఖానలో 30పడకలతో ప్రత్యేక కొవిడ్ వార్డు ను ఏర్పాటు చేశాం. అన్ని విభాగాల వైద్యులు, సిబ్బంది సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆదేశించాం. విపత్కర పరిస్థి తుల్లో విధులకు గైర్హాజరైనా, విధి నిర్వహణలో, వైద్యసేవలు అందించడంతో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించం.

– డాక్టర్ రాకేశ్ సహాయ్, ఉస్మానియా సూపరింటెండెంట్

కళా నీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనం

కళా నీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనాన్ని ప్రారంభించిన వక్తలు

రవీంద్రభారతి, జూన్ 1: శ్రీరాగరమ్య కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్(రి) ఆధ్వర్యంలో కళానీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధురి మంగళంపల్లి, రాజేశ్వరి కళానిలయం అధినేత అనూష, అపర్ణ, శ్రియ, మంజుల, డా.ఎం. శాంతిమోహన్ కూచిపూడి నాట్య నిలయం, శ్రీరాగరమ్య కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ వ్యవస్థాపకురాలు రమ్య, కరుణశ్రీ, కీర్తిరెడ్డి, ప్రశాంతి, రాణిప్రియ, రేణుక తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కళా నీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనం నృత్య రూపక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. సంగీతం, నృత్యం మానవ సంబంధాలలో ఒక భాగమని, నృత్యం మానసిక ఉల్లాసంతోపాటు మన ప్రాచీన కళలు, సంస్కృతిని తెలియజేస్తాయన్నారు. ప్రతి విద్యార్థినులు చదువుతోపాటు శాస్త్రీయ నృత్య కళలను నేర్చుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకు నాట్యగురువులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య చిన్నారులకు నృత్య, సంగీత కళానీరాజనం పట్ల అవగాన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు.

రేపు గో రక్షణ కోసం వీహెచ్‌పీ చలో ఓల్డ్ సిటీ

సుల్తాన్ బజార్, జూన్ 1 : గోవుల రక్షణ కోసం ఈ నెల 2న చలో ఓల్డ్ సిటీ –ఆపరేషన్ గోమాత అనే పేరుతో భారీ కార్యక్రమం చేపడుతున్నట్లువిశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, గోరక్ష విభాగం రాష్ట్ర సహ ప్రముఖ్ రమేశ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గో ప్రేమికులు, హిందూ సంఘాల నాయకులందరూ కూడా సోమవారం ఉదయం 9 గంటల వరకు కోఠిలోని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయం చేరుకోవాలని వారు సూచించారు. గో అక్రమ రవాణా విషయంలో కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని ఆరోపించారు.

ఏసీపీకి సన్మానం

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుల్తాన్ బజార్ ఏసీపీ మట్టయ్యను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి ఆధ్వర్యంలో ఏసీపీని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గులాబ్ సింగ్, బబ్లు సింగ్, అంటో, శేషు తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జూన్ 1

పార్లేజీ బుగ్గలోడా పాటల సీడీ ఆవిష్కరణ

పాటల సీడీని ఆవిష్కరిస్తున్న వక్తలు, హీరోబాంబే శీను హీరోయిన్ హారిక

రవీంద్రభారతి, జూన్1 : ఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మించ బడుతున్న సినిమాలోని పార్లేజీ బుగ్గలోడా పాటల సీడీని రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ థియేటర్స్‌లో ఆవిష్కరించారు. వక్తలుగా పాల్గొన్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, పేట్‌బషీర్‌బాగ్ ఏసీపీ బాలగంగిరెడ్డి, తెలుగు ఫిలిమ్ డైరెక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్, ఎస్ఆర్ఎఫ్ క్రియేషన్ యూట్యూబ్ ఛానల్‌లో పైడీ జయరాజ్ థియేటర్‌లో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సినీ హీరో బాంబేశీను, హీరోయిన్ హారిక పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నయ్య, శంకర్, రాకీ, షరీఫ్, మధు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు అభినందనలు

అబిడ్స్, జూన్ 1: తెలంగాణ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా నియమితులైన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను పలువురు కురుమ సంఘం నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా నియమితులైన తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించారని ఆయన ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ పార్టీని మరింత పటిష్టం చేస్తానన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సన్నబియ్యం, ఆహార భద్రత కార్డులు, రాజీవ్ యువ వికాసం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానన్నారు. ఈ నెల ఆరవ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గంలో 1500 కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు విచ్చేస్తుండటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ప్రతి అభివృద్ధిలో అండగా నిలుస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న అడిషనల్ డీసీపీ

ఎల్లమ్మ అమ్మవారిపూజల్లో పాల్గొన్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య

అంబర్‌పేట, జూన్ 1: అంబర్‌పేట డివిజన్ ప్రేంనగర్‌లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ 12వ వార్షికోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. నిర్వాహకురాలు ఎడ్ల సులోచన, కుమారులు అనిల్‌కుమార్, రాకేశ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు నర్సయ్యను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. చండీహోమం చేశారు. అనంతరం అమ్మవారి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం గావించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు ఎ. యశ్వంత్, నాయకులు జూలూరి తిరుపతి గుప్త, నిర్వాహకులు శైలజ, అవంతి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ కార్యాలయం ప్రారంభం

గోల్కొండ జగదాంబ బోనాల ఉత్సవ కమిటీ లంగర్ హౌస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆదివారం కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ అల్ హాజిరి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కే చంటిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సభ్యు లు ఏ సంతోష్ కుమా ర్ గౌడ్, ప్రదీప్ కుమార్,యాదగిరి,అనిత, ఎన్ శ్రీకాంత్,కుల వృత్తుల సంఘం సలహాదారు సాయిబాబా చారి, అధ్యక్షులు శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

– మెహిదీపట్నం జూన్ 1

ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కట్టా శ్రీనివాస్

కార్వాన్ సర్జీ మండి గంగపుత్ర సంఘం జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ 2025-26 సంవత్సరానికి గాను అధ్యక్షుడుగా కట్టా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దోర్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 51 సంవత్సరం జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా కట్ట శ్రీనివాస్‌ని ఎన్నుకున్నారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, వారి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 1

శాస్త్రీయ సంగీతంతో రఘునాథ్‌కు స్మరాంజలి

సంగీత కచేరీలో కళాకారులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 1 : హిందూస్తాని శాస్త్రీయ సంగీత విద్వాంసులు పండిట్ రఘునాథ్ తలే గౌకర్ ను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులు శాస్త్రీయ సంగీత సరాగాలతో ఘనంగా అంజలి ఘటించారు. ఆదివారం సాయంత్రం బిర్లా మందిర్ భాస్కర ఆడిటోరియంలో మృధుల ఫౌండేషన్, రఘునాథ్ తలే గౌకర్ ఫౌండేషన్ ట్రస్ట్, ఆగ్రా ఆధ్వర్యంలో రఘునాథాంజలి పేరట సంగీత కార్యక్రమం నిర్వహించారు. దేశంలో గుర్తింపు పొందిన కళాకారులు ఈ కచేరికి వాద్య సహకారం అందించి మైమరపించారు. డాక్టర్ గిరీంద్ర తలే గౌకర్, ప్రతిభ తలే గౌకర్, డాక్టర్ మేఘా తలే గౌకర్, శుభ్ర తలే గౌకర్ చేసిన శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందు చేసింది. జతిన్ నాగ్రాణి, మృధు నిశేష్ ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సి. యం. సాయి కార్తీక్, టి. శ్రీహరి చేసిన తబలా జుగల్ బంది సంగీత ప్రియులను ఉర్రూతలూగించింది. బెనారస్ ఘరానా సంగీత విద్వాంసులు పండిట్ ఆశిష్ నారాయణ్ త్రిపాఠీ, కూచిపూడి నాట్య కళాకారిణి గా గుర్తింపు పొందిన ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సంఘమిత్ర, తబలా విద్వాంసులు టి. జైకిషన్ పాల్గొని పండిట్ రఘునాథ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. మృదుల ఫౌండేషన్ రవి నిశేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

రైల్లోంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

కాచిగూడ, జూన్ 1: ఎంఎంటీఎస్ రైల్లోంచి గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారీపడి తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య విరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35)ఆదివారం ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దావకానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమ్మయ్య తెలిపారు.

బకాయిలు చెల్లించకుండా ఫీజులు పెంచితే యుద్ధమే

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

రవీంద్ర భారతి, జూన్ 1 : రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజులు పెంచాలన్న ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. బి-కేటగిరి సీట్లను ఆన్లైన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ లో విద్యార్థులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. డొనేషన్లు తీసుకునే కళాశాలలపై చర్యలు చేపట్టాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ ప్రతిపాదించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. కాలేజీలో ఫీజులు పెంచుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకుండా, ఫీజులు పెంచడం ఎంతవరకు సమంజసం అని రామకృష్ణ ప్రశ్నించారు. లక్షల్లో ఫీజులు పెంచుతూ ఫీజురీయింబర్స్‌మెంట్ మాత్రం పెంచకుండా ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై లక్షలాది రూపాయల భారం మోపుతూ పేద విద్యార్థులను చదువుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.కోట్లాది రూపాయలు బడా కాంట్రాక్టర్లకు ఇస్తూ పేద విద్యార్థులు చదువుకునేందుకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విద్యార్థులకు అది చేస్తాం ఇది చేస్తామని గొప్పలు చెప్పి ఇప్పుడు పేద విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వకుండా కాలేజీ ఫీజులు లక్షల్లో పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు పెంచకుండా నిరోధించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి నిరసనలు రాస్తారోకోలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని రామకృష్ణ హెచ్చరించారు.

శ్రీనివాస్‌రావును పరామర్శించిన కాలేరు పద్మ

కాలేయం వ్యాధి తో బాధపడుతున్న నెహ్రూనగర్‌కు చెంది న కాలేరు శ్రీనివాస్ రావును ఇటీవల కి మ్స్ ఆస్పత్రిలో కాలే య మార్పిడి చేశారు. విషయం తెలుసుకు న్న గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. – కాచిగూడ

భద్రత లేకుండా తిరగవద్దని ఎమ్మెల్యే రాజాసింగ్ నోటీసులు

అబిడ్స్ జూన్ 1: గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. రాజాసింగ్‌ను ఒంటరిగా తిరగవద్దు అంటూ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మంగళహాట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ రాజాసింగ్‌కు నోటీసులు జారీ చేశారు. ఆదివారం రాజాసింగ్ ఒంటరిగా బుల్లెట్‌పై తిరగడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. భద్రత సిబ్బంది లేకుండా తిరగడం ఆయనకు ప్రమాదకరంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో భద్రత లేకుండా బయటికి వెళ్లొద్దంటూ నోటీసులు ఇచ్చామని ఇన్స్పెక్టర్ మహేశ్ తెలిపారు.

పార్కులను సంరక్షించుకోవాలి

కాచిగూడ, జూన్ 1: రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి ప్రజలు బాధ్యతగా పార్కులను సంరక్షించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సమోసా పార్కును కార్పొరేటర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్క్, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పార్కులో వాకింగ్ కు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కన్నె రమేశ్‌యాదవ్, వాసు, శ్రీకాంత్, భీమ్రాజ్, సంతోష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

సమోసా పార్కును పరివీలిస్తున్న ఉమాయాదవ్

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అన్నారు. ఆదివారం రాత్రి మెహిహదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైత్రి పీస్ కమిటీ సభ్యుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జంతువుల వధ విషయంలో నిబంధనలను ప్రతి పాటించాలని అన్నారు. అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్దికి, ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, విజయ శ్రీనివాస్, మునవర్, ఇన్స్పెక్టర్లు, మైత్రి, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 1

లుద్మిల సాగర్ పిల్లా భారతనాట్య అరంగేట్రం

భరతనాట్య అరంగేట్రం ప్రదర్శనలో లుద్మిల్ల సాగర్‌పిల్లా

రవీంద్రభారతి, జూన్ 1 : నాట్యగురువు ప్రియ వెంకటరామన్ శిష్యురాలు లుద్మిల్ల సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని అయిన లుద్మిల సాగర్‌పిల్లా 2016లో భరత నాట్యం మొదలుపెట్టింది. చదువుతో పాటు బాస్కెట్ బాల్‌లో కూడా రాణిస్తున్నది. న్యూఢిల్లీలోని సీఆర్ పార్కులో దుర్గాపూజోత్సవాల సందర్భంగా తన గురువుతో కలసి ప్రదర్శన ఇచ్చే అవకాశం లభించింది. లుద్మిల్ల సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఆలేఖ్య పుంజాల, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం ను ప్రారంభించి ఆశ్వీరదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలపట్ల అభిరుచి కల్పించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పిల్లలకు శాస్త్రీయ కళలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. సభకు ముందు సాగర్ పిల్లా ప్రదర్శించిన భరతనాట్య అరంగేట్రం వీక్షకులను ఆకుట్టుకున్నది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, వయోలిన్ వెంకటేశ్ కుప్పుస్వామి, మృదంగం మురళి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో పక్వాన్ గ్యాస్ కిట్ల పంపిణీ

గ్యాస్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

మెహిదీపట్నం జూన్ 1 : ఆసిఫ్ నగర్‌లోని రాయల్ రెజెన్సీ ఫంక్షన్‌హాల్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో గ్యాస్ కిట్లను పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజల సేవకు తాము ఎల్లప్పుడూ ముందుఉంటామన్నారు.